
విద్యుత్ కాంతుల్లో కొమురవెల్లి మల్లికార్జున ఆలయం

న్యూస్‌రీల్

రాజీ మార్గంతోనే కేసుల పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి

సిద్దిపేటకమాన్: రాజీ మార్గంతోనే కేసులు పరిష్కరించుకునేలా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి అన్నారు. మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని సిద్దిపేట కోర్టు ఆవరణలో పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజీపడదగిన కేసులు పరిష్కరించుకునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్

ఎంపీ రఘునందన్ రావు

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం స్థానిక కొండ భూదేవి గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీగా గెలిచిన వారు ప్రజా గొంతుకగా ఉండాలన్నారు. అంతకుముందు పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి మాట్లాడారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

వ్యవసాయ శాఖ అధికారి రాధిక


రైతు రాంరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

సిద్దిపేటజోన్: నానో యూరియా, డీఏపీ వినియోగించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాధిక అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నానో యూరియా, డీఏపీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు అధికంగా వాడటం వల్ల భూసారం దెబ్బ తింటుందన్నారు. అలాగే అనేక అనారోగ్యాలకు కారణంగా మారుతుందన్నారు. నానో యూరియా. డీఏపీలను పిచికారీ చేయడం వల్ల మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులు జీడిపల్లి రాంరెడ్డి, అశోక్ రెడ్డి, ఎల్లాగౌడ్, రంగయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో మార్క్ ఫెడ్ జిల్లా అధికారి క్రాంతి, మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

మల్లన్న పెద్ద పట్నానికి పటిష్ట బందోబస్తు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే పెద్దపట్నానికి పటిష్ట బందోబస్తు చేపట్టినట్లు సీపీ అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు చేపట్టామన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఆలయ ఆవరణలో 80 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు.

బీజేపీ పాలనలో దేశం అధోగతి

ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్

దుబ్బాక: దేశాన్ని అన్ని రంగాల్లో బీజేపీ ప్రభుత్వం సర్వనాశనం చేస్తోందని ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోని 6 పథకాలు అమలు చేశామన్నారు. ఏడాదిలోనే 56 వేల మందికి ఉద్యోగాలు అందించామన్నారు. ఎవరెన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగకుండా కాంగ్రెస్ బలపర్చిన నరేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

హర హర మహాదేవ..

నేడే 'మహా' ఉత్సవం.. అంతా సిద్ధం

- ముస్తాబైన శైవక్షేత్రాలు
- శివనామస్మరణతో మారుమోగనున్న ఆలయాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహా శివరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఆలయాలన్నీ విద్యుద్దీపాలతో అలంకరించారు. శైవభక్తులకు అతి ముఖ్యమైన పండుగ శివరాత్రి. జిల్లా కేంద్రంలోని ఉమాపార్థీవకోటిలింగాల ఆలయంతో పాటు అన్ని దేవాలయాలలో ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు సిద్ధం చేశారు. అభిషేక ప్రియుడు శివుడికి పంచామృతాలతో అభిషేకం చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు. భక్తులకు ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

పెరిగిన పండ్ల ధరలు

శివరాత్రి పర్వదినం వేళ పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. భక్తులు రోజంతా ఉపవాసం ఉంటారు. కేవలం పండ్లు మాత్రమే తీసుకుంటారు. గత ఏడాది కంటే ఈసారి ధరలు అధికంగా పెరిగాయి. అరటి పండ్లు డజన్(12) రూ. 60, దానిమ్మ కిలో రూ.200, ఆపిల్ కిలో రూ.220, కమల (సంత్ర) రూ.100, ద్రాక్ష రూ.100, ఖర్జూర కిలో రూ.250, వాటర్‌మిలాన్ రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు.


ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయం


ఆలయంలో ఏర్పాట్లు


సిద్దిపేట పట్టణంలో పండ్లు కొనుగోలు..

ప్రలోభాలకు ఎర

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- పట్టభద్రుల స్థానానికి 56 మంది.. ఉపాధ్యాయకు 15 మంది పోటీ
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు
- జిల్లాలో 32 వేల మంది పట్టభద్రులు



సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సాగింది. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసన మండలి స్థానాల ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఈ నెల 27న ఎన్నికలు జరగనుండటంతో ఓటర్ల ప్రలోభాలకు తెరలేపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 15 మంది, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది బరిలో ఉన్నారు.

సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యాప్తంగా 32,589 మంది పట్టభద్రులు, 3,212 మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ నుంచి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూ మద్దతుతో వంగ మహేందర్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ నుంచి అంజిరెడ్డి, కాంగ్రెస్ నుంచి నరేందర్ రెడ్డి, బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణ పోటీ పడుతున్నారు. బీసీ నినాదాన్నే నమ్ముకుని ప్రసన్న హరికృష్ణ ప్రచారంలో ముందుకు సాగారు.

సోషల్ మీడియాలో హోరెత్తిన ప్రచారం

నాలుగు ఉమ్మడి జిల్లాలు 42 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. సోషల్ మీడియానే ఎక్కువగా అభ్యర్థులు ఎంచుకున్నారు. వాట్సప్ గ్రూప్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వేదికగా తమ గళంను వినిపించారు. తమకు ఓటేస్తే నిరుద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలపై తాము చేసిన ఉద్యమాలతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై తమ వైఖరిని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

గెలుపే లక్ష్యంగా పార్టీలు

ఈ ఎన్నికల ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశం ఉండటంతో బీజేపీ, కాంగ్రెస్‌లు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఆయా నియోజకవర్గాల వారీగా వివిధ జిల్లాలకు చెందిన నాయకులను ఇన్‌చార్జిలుగా నియమించారు. వీరు ఉదయం నుంచి రాత్రి వరకు పలువురు ఓటర్లను కలుస్తూ తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. అలాగే జిల్లాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, బీజేపీ ఎంపీ రఘునందన్ రావులు వారి వారి అభ్యర్థులకు మద్దతుగా సమావేశాలు నిర్వహించారు.

ఉపాధ్యాయ ఓటర్లను కలుస్తూ..

ఉపాధ్యాయుల సమ్మేళనాలు, సమావేశాలతో పాటు నేరుగా ఓటర్లతో అనుసంధానమవుతూ తమకు ఓటేయాల్సిన అవశ్యకతను వివరించారు. ఉపాధ్యాయ సంఘాలతో.. సమావేశాలతో ఓటర్లను అభ్యర్థిస్తూ మరో వైపు రాత్రి వేళ డిన్నర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా పార్టీలు, సంఘాలు 25 నుంచి 50 ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించారు. పలువురు ఓటర్లు ఒక టీంగా ఏర్పడి వివిధ పార్టీల తరుపున బరిలో ఉన్న అభ్యర్థులను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. మరి కొందరు స్థానిక లీడర్ల ద్వారా చర్చలు జరుపుతున్నారు. పోలింగ్‌కు ఒక్క రోజే ఉండటంతో అభ్యర్థులు పంపకాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పట్టభద్రుల ఓటర్లకు ఒక్కొక్కరికి దాదాపు రూ2వేల వరకు, ఉపాధ్యాయ ఓటర్లకు దాదాపు 5వేల వరకు ఇచ్చి తమవైపునకు తిప్పుకునే అవకాశం కనిపిస్తోంది.

163 బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ అమలు

పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల చుట్టూ163 బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ అమలు చేస్తున్నారు. పార్టీ జెండాలు, ప్ల కార్డులు ప్రదర్శించవద్దని, ఊరేగింపులు చేయవద్దని పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అన్ని పార్టీలకు సూచించారు.

రహదారి పనులు వేగిరం చేయండి

- కలెక్టర్ మనుచౌదరి
- నేషనల్ హైవే అథారిటీ అధికారులకు దిశానిర్దేశం


హుస్నాబాద్‌లో జాతీయ రహదారి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్: మెదక్–ఎల్కతుర్తి జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. హుస్నాబాద్ పట్టణం మీదుగా నిర్మిస్తున్న రహదారి, ఇరు వైపులా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి వెంబడి నిర్మిస్తున్న తాగునీటి పైపు లైన్ పనులను పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు, మహిళా శక్తి భవనం నిర్మాణానికి జిల్లెల్లగడ్డ, ఉమ్మాపూర్‌లలో స్థలాలను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలను చూపించి వివరాలను కలెక్టర్‌కు అందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ వార్డెన్లను ఆదేశించారు. మంగళవారం పాలమాకుల ఎస్సీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాంట్రాక్టర్ నాణ్యమైన సరుకులు అందజేయకుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. హాస్టల్ భవనం పెచ్చులూడుతున్నందున మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి హామీద్ తహసీల్దార్, ఆర్‌ఐ తదితరులు ఉన్నారు.

ఏకరూప దుస్తులకు చర్యలు చేపట్టండి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్
- విద్యాశాఖ అధికారులతో సమావేశం


పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాల, గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు యూనిఫాంలను అందించేందుకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. గరిమా అగర్వాల్ మాట్లాడుతూ యూనిఫాంలు అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. యూనిఫాం తయారీలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ అధికారులకు సూచించారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

దౌల్తాబాద్ (దుబ్బాక): పాఠశాలలోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. శేరిపల్లి బందారంలోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను, కళాశాలను సందర్శించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు.

పట్టభద్రులు కాంగ్రెస్ వైపే

- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్
- మంత్రితో కలిసి సిద్దిపేటలో ప్రత్యేక పూజలు


సిద్దిపేటలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న పీసీసీ చీఫ్, మంత్రి తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టభద్రులు కాంగ్రెస్ వైపే ఉన్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు తథ్యమని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తూ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సిద్దిపేట పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం, రావిచెట్టు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆరోపించారు. అందుకే బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. నిరుద్యోగులకు, పట్టభద్రులకు ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పట్టభద్రులు ఆలోచించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తుంకుంటా నర్సారెడ్డి, హరికృష్ణ , చెరుకు శ్రీనివాస్ రెడ్డి, అత్తు ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

వీడిన మహిళ అదృశ్యం మిస్టరీ!

అడవిలో మహిళ మృతదేహం లభ్యం


యాదమ్మ(ఫైల్)

వర్గల్(గజ్వేల్): మండల పరిధి అనంతగిరిపల్లికి చెందిన మహిళ అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు ఛేదించినట్లు తెలుస్తోంది. ఈ నెల 15న గ్రామానికి చెందిన దార యాదమ్మ(40) బ్యాంకులో డబ్బులు తీసుకునేందుకు వెళ్తున్నట్లు చెప్పి ఆ తరువాత జాడతెలియకుండా పోయిన విషయం తెల్సిందే. ఈ మేరకు గౌరారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి వివిధ కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే దర్యాప్తులో పురోగతి సాధించిన పోలీసులు కోమటిబండ అడవి ప్రాంతంలో మహిళ యాదమ్మ మృతదేహాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది. అనంతగిరిపల్లికి చెందిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఒకటి లేదా రెండు రోజులలో మిస్సింగ్ కేసు వివరాలను పోలీసులు వెల్లడించే అవకాశముంది.

భవిష్యత్తుకు క్రమశిక్షణే తొలి మెట్టు

- విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి
- డీఐఈఓ రవీందర్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు క్రమ శిక్షణే తొలి మెట్టుగా నిలుస్తుందని డీఐఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లి మోడల్ స్కూల్‌లో మంగళవారం స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.


కోహెడ: బహుమతులు అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కోహెడ(హుస్నాబాద్): విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈఓ రవీందర్ రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల ప్రిపరేషన్‌పై దిశానిర్దేశం చేశారు. వార్షికోత్సవం వేళ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో యాదగిరి, రాజమౌళి, అశోక్, రజిత, నీరజ, సీతారామయ్య, నరేష్, వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

జన జాతరకు రారండి

- నేటి నుంచే ఏడుపాయల జాతర
- పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి దామోదర
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్


జాతరకు ముస్తాబైన దుర్గమ్మ ఆలయం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జన జాతరకు వన దుర్గమ్మ ముస్తాబైంది. మహాశిరాత్రి పురస్కరించుకొని బుధవారం ప్రారంభం కానున్న జాతరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రభుత్వం తరపున హాజరై దుర్గమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేసింది. ఏర్పాట్లలో ఎక్కడా రాజీలేకుండా కలెక్టర్ రాహుల్‌రాజ్ చర్యలు చేపట్టారు. సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

భారీ ఏర్పాట్లు

తెలంగాణలోనే అతి పెద్దదైన ఏడుపాయల జాతర కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. సింగూరు నుంచి 0.35 టీఎంసీల నీటిని మంగళవారం విడుదల చేశారు. స్నానాల కోసం షవర్ బాత్‌లు, బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక టెంట్లు ఏర్పాటు చేశారు. నీటి ప్రమాదాలు జరగకుండా 150 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వైద్య క్యాంపులను ఏర్పాటు చేశారు. తాగు నీటి కోసం 144 కుళాయిలు, 27 ట్యాంకర్లు, 476 శౌచాలయాలు ఏర్పాటు చేశారు. 598 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. 400 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి జాతర వరకు ఉచిత బస్సు సౌకర్యాం కల్పించనున్నారు. జాతరలో మద్య నిషేధం కోసం మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు నిరంతర విద్యుత్ అందించనున్నారు. ఆలయం ముందు షామియానాలు, క్యూలైన్లు, మంజీరా నదిలో శివుని విగ్రహం ఏర్పాటు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయ ప్రాంగణాన్ని అలంకరించారు.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు: కలెక్టర్

ఏడుపాయల జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ నగేష్, డీఎస్పీ ప్రసన్న కుమార్, ఆర్డీఓ రమాదేవితో కలసి ఏడుపాయల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరలో తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యం, రవాణ విషయాలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నోడల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. మూడు షిఫ్టులలో పారిశుద్ధ్య సిబ్బంది పనులు చేయాలని ఆదేశించారు. హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి, సమన్వయ పరుచుకోవాలని అధికారులకు సూచించారు.

క్లుప్తంగా

ఓఆర్ఆర్‌పై కారు దగ్ధం

● ఎయిర్ పోర్టుకు వెళ్తుండగా ఘటన


దగ్ధమైన కారు

పటాన్‌చెరు టౌన్ : ఎయిర్ పోర్టుకు వెళ్తుండగా ఓఆర్ఆర్‌పై కారు దగ్ధమైన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని మల్లంపేటకు చెందిన రామకృష్ణ భగవాన్ కారులో మంగళవారం సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్ నుంచి ఎయిర్ పోర్ట్‌కు వెళ్తున్నాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటీ సమీపంలోకి రాగానే కారులో నుంచి పొగలు రావడం గమనించాడు. భగవాన్ వెంటనే కారును పక్కకు నిలిపి చూడగా అప్పటికే కారులోంచి మంటలు వ్యాపించాయి. కొద్దిసేపటికే కారు పూర్తిగా కాలిపోయింది.

కుక్కల దాడిలో 16 గొర్రెలు మృత్యువాత

● మరో పదింటికి తీవ్రగాయాలు


మృత్యువాత పడిన గొర్రెలు

ములుగు(గజ్వేల్) : కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన ములుగులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ములుగుకు చెందిన ఎక్కాల మల్లయ్య గొర్రెలను సోమవారం మేతకు తీసుకెళ్లి రాత్రి అయ్యాక ఇంటి సమీపంలోని కొట్టంలోకి తోలాడు. మంగళవారం తెల్లవారు జామున వెళ్లి చూసేసరికి కుక్కల దాడిలో 16 గొర్రెలు మృత్యువాత పడి ఉన్నాయి. మరో పదింటికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు మల్లయ్య తెలిపాడు. ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని వేడుకున్నాడు.

పోలీసు వాహనం బోల్తా

● ఆరుగురు సిబ్బందికి గాయాలు


బోల్తా పడిన పోలీసు వాహనం

పటాన్‌చెరు టౌన్: ఎస్కార్ట్ కోసం వెళ్తున్న పోలీసు వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఆరుగురు సిబ్బందికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా కంది జైలులో ఉన్న ఖైదీలను తీసుకురావడానికి మంగళవారం సైబరాబాద్ నుంచి ఏఆర్ పోలీస్ సిబ్బంది ఓఆర్ఆర్ రహదారి మీదుగా వాహనంలో వెళ్తున్నారు. పటాన్‌చెరు టోల్ గేట్ సమీపంలో వాహనం వెనుక టైరు పంచర్ అయ్యి అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గొండ్ర శ్రీకాంత్, కానిస్టేబుల్‌లు రఫిక్, సురేశ్, శ్రీధర్‌కు తీవ్రంగా గాయాలు అయ్యాయి. మరో ఇద్దరి కానిస్టేబుళ్లు ఆనంద్, నర్సింహులుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైటెక్ సిటీలోని యశోదా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవర్ శ్రీధర్ మంగళవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎత్తిపోతల ఉత్తిదేనా?

- మరమ్మతులకు నోచుకోని ఎత్తిపోతలు
- తగ్గుముఖం పట్టిన భూగర్భజలాలు
- చండూర్, గంగారం గ్రామాల్లో అధ్వాన పరిస్థితులు
- 1,300 ఎకరాలకు అందని సాగు నీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- పట్టించుకోని అధికారులు

కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయకపోడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో ఆయకట్టు రైతులు సాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో పంట చేతికి వచ్చే సమయానికి పరిస్థితి ఏంటోనని ఆందోళనలో చెందుతున్నారు చిలప్‌చెడ్ మండలంలోని చండూర్, గంగారం గ్రామాల రైతులు. ఈ రెండు ఎత్తిపోతల కింద సాగుకు 1,300 ఎకరాలు ఉన్నాయని అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– చిలప్‌చెడ్(నర్సాపూర్):

చిలప్‌చెడ్ మండలంలోని ఫైజాబాద్, చండూర్, గంగారం గ్రామాల్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ 2004లో పల్లెబాటలో భాగంగా మంజీరా నది ఒడ్డున ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. 2009లో అప్పటి కాంగ్రెస్ పార్టీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సునీతారెడ్డి భూమి పూజ చేశారు. సుమారు రూ.13.40 కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల నిర్మాణాలు 2013లో పూర్తయ్యాయి. ఎత్తిపోతలతో సుమారు 2,100 ఎకరాలకు పుష్కలంగా సాగు నీరు అందేది. దీంతో 1,500 మంది రైతులు ఏటా రెండు పంటలు పండించేవారు.

కమ్మేసిన మట్టి, ముళ్ల పొదలు

ఫైజాబాద్ మినహా ఐదేళ్లుగా చండూర్, గంగారం గ్రామాల్లో ఎత్తిపోతలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. రెండేళ్ల కిందట మంజీరా నదికి వరదల తాకిడి ఎక్కువ కావడంతో ఒడ్డుకు ఉన్న గంగారం, చండూర్ ఎత్తిపోతలు దెబ్బతిన్నాయి. ప్రాజెక్ట్ వెళ్లే దారులు వరదలకు కోతకు గురయ్యాయి. చాలా కాలంగా వాటి వైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. దారులు మూసుకుపోవడంతో పాటు, ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లను చుట్టూ మట్టి, ముళ్ల పొదలు కమ్మేశాయి. ఎత్తిపోతలు నడవడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, స్టార్టర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇన్ టెక్ వాల్స్, పైపులు సైతం పాడైపోయాయి. మరమ్మతులు చేసేందుకు రైతులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.


చండూర్ శివారులో ముళ్లపొదల మధ్య ఎత్తిపోతల ప్రాజెక్ట్

1,300 ఎకరాలకు సాగు నీరు

ఈ రెండు ఎత్తిపోతలు ప్రారంభమైతే చెరువులు, కుంటలు నిండుకుండలా మారి సాగు నీరు అందడంతోపాటు, చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. చండూర్, గంగారం గ్రామాల్లో మరమ్మతులు జరగకపోవడంతో 1,300 ఎకరాలకు సాగు నీరు అందడం లేదు. భూగర్భ జలాలు మరింత తగ్గుముఖం పడితే రైతుల పరిస్థితి ప్రశ్నార్థకమే.


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

అధికారులకు విన్నవించాం



చండూర్ గ్రామంలో ఎత్తిపోతలకు మరమ్మతులు చేయించాలని నీటి పారుదల శాఖ డీఈకి వినతిపత్రం అందజేశాం. కొన్నేళ్లుగా ఎత్తిపోతలు పని చేయకపోవడంతో చాలా వరకు పంట నష్టపోయాం. ప్రస్తుతం పంటలు బాగానే ఉన్నా బోర్లు తక్కువయ్యాయి. పంట చేతికి వచ్చే సమయానికి, సాగుకు నీరు అందకపోతే పంట నష్టం తప్పదు. ఎత్తిపోతలు తిరిగి ప్రారంభమైతే సాగు నీటికి సమస్య ఉండదు.

– దాసరి శేషాద్రి, రైతు, చండూర్

రూ.13 లక్షలకు ప్రతిపాదనలు

చిలప్‌చెడ్ మండలంలోని చండూర్, గంగారం గ్రామాల ఎత్తిపోతల మరమ్మతులకు సుమారు రూ.13 లక్షలకు ప్రతిపాదనలు పంపించాం. వరద కారణంగా భారీగా దెబ్బతిన్న ఎత్తిపోతల మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంతో లేదు. త్వరలోనే పనులు చేసే విధంగా తగిన చర్యలు తీసుకుంటాం.

– జగన్నాథం, ఇరిగేషన్ డీఈ, కౌడిపల్లి

చెరువులో పడి ఇద్దరు యువకులు మృతి

నర్సాపూర్ రాయరావు చెరువు వద్ద ఘటన


సునీల్‌గౌడ్ (ఫైల్)


ప్రవీణ్ (ఫైల్)

నర్సాపూర్ : చెరువులో పడి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ రాయరావు చెరువులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం కథనం మేరకు.. నర్సాపూర్‌కు చెందిన డి.సునీల్‌గౌడ్(31), సారా ప్రవీణ్ (31) ఇద్దరూ స్నేహితులు. ఇళ్ల నుంచి సోమవారం సాయంత్రం బయటకు వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆచూకీ కోసం వెతుకుతుండగా మధ్యాహ్నం నర్సాపూర్ రాయరావు చెరువు వద్ద బైక్ కనిపించింది. పక్కనే మద్యం సీసాలు లభ్యమయ్యాయి. అనుమానంతో చెరువులో వెతకగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సునీల్‌గౌడ్ తండ్రి రెండేళ్ల కిందట మృతి చెందాడు. దీంతో సునీల్ గౌడ్ కల్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. మరో మృతుడు సారా ప్రవీణ్ కూడా చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. ఏడేళ్ల కింద ఇతడికి వివాహం కాగా భార్య, కుమారుడు ఉన్నారు. ఇతడు పేటీఎం సంస్థలో లోన్ రికవరీ పర్సన్‌గా డ్యూటీ చేస్తున్నాడు.

వైరస్ సోకి 500 కోళ్లు మృత్యువాత

కాసాల గ్రామంలో ఘటన

హత్నూర(సంగారెడ్డి): వైరస్ సోకి కోళ్లు మృత్యువాత పడిన ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామ శివారులో చోటు చేసుకుంది. కాసాల గ్రామానికి చెందిన సాలె రాములుకు గ్రామ శివారులో పౌల్ట్రీ ఫామ్ ఉండగా దేవులపల్లి గ్రామానికి చెందిన రాకేశ్ లీజుకు తీసుకొని పౌల్ట్రీ నిర్వహిస్తున్నారు. ఒక్కసారిగా వైరస్ సోకి ఐదు రోజుల నుంచి రోజు వందలాది కోళ్లు మృతి చెందుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే 500 కోళ్లు చనిపోయినట్లు పౌల్ట్రీ ఫామ్ నిర్వాహకులు తెలిపారు. దీంతో ట్రాక్టర్ ట్రాలీలో మృతి చెందిన కోళ్లను ఇతర ప్రాంతానికి తరలించి పాతిపెట్టారు. ఈ విషయమై దౌల్తాబాద్ పశు వైద్యాధికారి హేమలతను సంప్రదించగా నిర్వాహకులు తమకు సమాచారం ఇవ్వలేదని చెప్పారు. కానీ ఐదు రోజుల నుంచి కోళ్లు చనిపోతున్న విషయం తెలిసిందన్నారు. వాళ్లు చెప్పిన సమాచారం ప్రకారం వైరస్ వల్ల చనిపోయానని భావిస్తున్నట్లు తెలిపారు. పౌల్ట్రీ ఫామ్‌ను సందర్శించి వివరాలు సేకరిస్తామన్నారు.


ట్రాక్టర్ ట్రాలీలో మృతి చెందిన కోళ్లు

బంగారం చోరీ కేసులో వ్యక్తి రిమాండ్


మాట్లాడుతున్న సీఐ లతీఫ్

కొండపాక(గజ్వేల్): మహిళ మెడలోంచి పుస్తెల తాడును అపహరించిన దొంగను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. నంగునూరు మండలంలోని సిద్దన్నపేట గ్రామానికి చెందిన కొంకటి తిరుపతి (27) ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. తండ్రి అనారోగ్యానికి గురవ్వడంతో కుటుంబ పోషణ తిరుపతి చూసు కుంటూ మద్యానికి బానిసయ్యాడు. డబ్బులు లేక దొంగతనం చేయాలని నిర్ణయించుకొని 22న కొమురవెల్లి మల్లన్న జాతరకు వచ్చాడు. జాతరలో కత్తిని కొనుగోలు చేసుకొని దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు ఎక్కువ సంఖ్యలో చేయలేదు. 24న తిమ్మారెడ్డిపల్లి శివారులోని కొమురవెల్లి కమాన్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు వస్తున్న నంగునూర్ మండల కేంద్రానికి చెందిన మహిళ సొప్పరి సుగుణ మెడలోంచి మూడున్నర తులాల పుస్తెల తాడును తెంపుకొని వెళ్తుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి పుస్తెల తాడు, కత్తి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చి జ్యుడిషల్ రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారంటూ..

తహసీల్దార్ కార్యాలయం ఎదుట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆందోళన

చేర్యాల(సిద్దిపేట): వారసత్వంగా తనకు రావాల్సిన భూమిని తన బాబాయి అక్రమంగా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నాడని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట భార్యతో కలిసి బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ తనకు తాత నిమ్మ రాజారెడ్డి(మాజీ మంత్రి)నుంచి వారసత్వంగా రావాల్సిన ఆకునూరు రెవెన్యూ పరిధిలోని 8 ఎకరాల 34 గుంటల భూమి బాబాయి నిమ్మ ప్రభాకర్‌రెడ్డి పేరిట ఉందన్నారు. దీంతో తనకు రావాల్సిన భూమిని అక్రమంగా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నాడని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఆయనకు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీధర్, మాజీ వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, నాయకులు బాల్ నర్సయ్య, వెంకట్‌మావో, సతీశ్‌గౌడ్, సిద్దులు గౌడ్, నాగేశ్వరరావు తదితరులు మద్దతు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతదేహాన్ని బయటకు తీస్తున్న గ్రామస్తులు


రాములు (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : అనుమానాస్పద స్థితిలో చెరువులో వ్యక్తి మృతి ఘటన మండలంలోని అందుగులపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ రాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన అక్కమొల్ల గణేశ్(40) సోమవారం ఉదయం వ్యవసాయ పొలం వద్దకని ఇంటి నుంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం పొలం వద్ద చూడగా చెప్పులు కనిపించాయి. పొలానికి సమీపంలోని పెద్ద చెరువు వద్ద వెతుకుతుండగా గ్రామానికి చెందిన జగపతి తీసిన సంపులో శవమై కనిపించాడు. మృతదేహాన్ని బయటకు తీస్తుండగా మృతుడి కాళ్లు, చేతికి ఉన్న కడియంకు చేపల కోసం వేసిన వల చుట్టుకొని ఉంది. భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా కార్మికుడు..

కొండాపూర్(సంగారెడ్డి): అనుమానాస్పదంగా కార్మికుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మల్లెపల్లిలో గల యునైటెడ్ బేవరేజ్ పరిశ్రమలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మారేపల్లికి చెందిన ఉత్తెరపల్లి రాములు (30) రోజు మాదిరిగా మంగళవారం ఉదయం పరిశ్రమకు వచ్చాడు. రాములుకు పరిశ్రమలో ప్రమాదం జరిగిందని 7 గంటల సమయంలో తోటి కార్మికులు అతడి వరుసకు సోదరుడైన రాజుకు ఫోన్ చేసి చెప్పారు. దీనిపై యాజమాన్యం ఎలాంటి సమాచారం అందించలేదని గ్రామస్తులు, కుటుంబీకులు పరిశ్రమ ఎదుట బైఠాయించారు. మృతదేహాన్ని చూపించే వరకు కదిలేది లేదని, పరిశ్రమ యాజమాన్యమే రాములును హత్య చేసినట్లు అనుమానం ఉందని పోలీసులతో వాగ్వాదం చేశారు. చివరకు యాజమాన్యం దిగొచ్చి మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. మృతుడి సోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరీశ్ శంకర్ తెలిపారు.

ఇంట్లో మరో వ్యక్తి..

సదాశివపేట (సంగారెడ్డి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శివన్న గారి ఈశ్వరప్ప(60) ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు తెరిచి చూడగా మూడు రోజుల కిందటే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభ్యర్థుల విజయం ఖాయం

జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులిద్దరి విజయం ఖాయమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య పోటీలో ఉన్నారని తెలిపారు. వారిద్దరి కోసం తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ కేంద్రంలో బీజేపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తున్నారని, తమకు ఓటర్ల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. రెండు స్థానాలు తమ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్లందరూ తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

పొట్టకూటికి వచ్చి వాగులో పడి మృతి

- కూడవెల్లి వాగులో కాళ్లు కడుక్కోవడానికి వెళ్లిన వ్యక్తి
- ప్రమాదవశాత్తు కాలిజారి పడిపోవడంతో మృత్యువాత


అంజయ్య మృతదేహం

మర్కూక్(గజ్వేల్): ప్రమాదవశాత్తు కూడవెల్లి వాగులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు చెందిన బొంత అంజయ్య (40) రోజు మాదిరిగానే మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసొచ్చి నర్సన్నపేట, ఎర్రవల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలకు గుంతలు తీస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో పక్కనే కూడవెల్లి వాగులో కాళ్లు, చేతులు కడుక్కోవడానికి వెళ్లారు. ముందుగా వెళ్లిన అంజయ్య చేతులు కడుగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో పడిపోయాడు. వెంటనే కూతురు భారతి, అల్లుడు నవీన్ తమ వద్ద ఉన్న చీరను చెరువులోకి విసిరి కాపాడే ప్రయత్నం చేశారు. ఈత రాకపోవడంతో అప్పటికే అంజయ్య చెరువులో మునిగిపోయాడు. వారి అరుపులు విన్న గ్రామస్తులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కూతురు భారతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్యాన్సర్‌తో ఫీల్డ్ అసిస్టెంట్..


శ్రీనివాస్ (ఫైల్)

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల పరిధిలోని రాంసాగర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రామొల్ల శ్రీనివాస్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు చందాలు వేసుకొని మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీడీవో బాలయ్య కార్యాలయ సిబ్బందితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవి మండల కమిటీతో కలిసి రూ.8 వేలు సాయం అందించారు. గతేడాది శ్రీనివాస్ సోదరుడు మృతి చెందాడు. ఇద్దరు అన్నాదమ్ముళ్లు మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడింది. అలాగే తండ్రి గతంలోనే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య సుజాత కూతురు శ్రీవల్లిక, కుమారుడు నిశాంత్ ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో రాములు, టీఏ రవి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నది ఉన్నట్టు.. చిత్రం అదిరేట్టు

కళ్లు చెదిరిపోయే గోడ చిత్రాలు

- ఏ బొమ్మనైనా నిమిషాల్లో పేపర్‌పై దింపగలడు
- బహుముఖ ప్రతిభావంతుడు నవనీత్


వారణాసిలో గోడలపై గీసిన దేవుళ్ల కళాఖండాలు

హుస్నాబాద్: అతను కుంచె పడితే చిత్రం చిరునవ్వు నవ్వుతుంది. బొమ్మకి ప్రాణం వస్తోంది. మనసులో భావాలను పేపర్ పై అందంగా చిత్రీకరించగలడు. కలర్స్ లేకుండా మెర్కిల్స్ చూపించగలడు ఈ ఇంజనీర్. ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థల్లో విద్యా బోధన చేశాడు. సామ్ సాంగ్ కంపెనీలో డిజైనర్ ఇంజనీర్‌గా పని చేశాడు. తన ప్రతిభతో పది వరకు పెటెంట్లను పొందాడు. ప్రస్తుతం జీవ కళలకు జీవం ఉట్టిపడేలా గోడలపై పెయింటింగ్ వేస్తూ పురాణాలకు తిరిగి జీవం పోస్తున్నాడు బహుముఖ ప్రతిభావంతుడు నవనీత్.

హుస్నాబాద్ పట్టణానికి చెందిన పంతం నవనీత్ తండ్రి గోవర్ధన్ చనిపోగా, తల్లి కన్యాకుమారి కుట్టుమిషన్ నడుపుతూ కుమారుడిని చదివిస్తోంది. నవనీత్‌కు చిన్ననాటి నుంచే కళలపై ఆసక్తి ఉండేది. నాగ్‌పూర్‌లోని ఎన్ఐటీలో ఆర్కిటెక్చర్, బిల్ట్ ఎన్విరాన్మెంట్ కోర్సు పూర్తి చేశాడు. లైన్ ఆర్ట్‌లో అసాధరణమైన ప్రతిభను కలిగి ఉన్నాడు. ఆర్ట్స్ డిజైన్‌లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని విజయం సాధించాడు. ఆర్కిటెక్ పోస్టర్ డిజైన్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. ముంబాయిలోని ఐడీసీ స్కూల్ ఆఫ్ డిజైన్‌లో కమ్యూనికేషన్ డిజైన్‌లో మాస్టర్స్ పూర్తి చేశాడు. ఈ కాలంలో కథా రచన, సినిమా, పిల్లల కోసం బొమ్మల కథలు మాస్ మీడియా కమ్యూనికేషన్ వంటి విభాగాలను విశ్లేషించి వాటి పై ఆసక్తి పెంచుకున్నాడు. ఎన్నో పోటీల్లో పాల్గొని పెటెంట్లను సొంతం చేసుకున్నాడు.

స్వీయ అభివృద్ధి కోసం నైపుణ్యం

చేతితో గీసిన బొమ్మలు, పెన్నుతో రాసిన అక్షరాలు మదిలో ఎప్పటికీ గుర్తుంటాయని నమ్ముతాడు నవనీత్. త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ఉద్యోగాలను దోచుకుపోతుంది. సృజనాత్మకత, పరిశోధన, విశ్లేషణ నైపుణ్యం లేకపోతే చాలా మంది ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెంచుకొని స్వస్థలమైన హుస్నాబాద్‌లో తల్లి సహాయంతో ఎంఎండబ్ల్యూడీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించనున్నారు. దీని ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలనే లక్ష్యం పెట్టుకున్నాడు.

గోడ చిత్రం ఆలయ స్థలంగా..

నవనీత్ అత్యంత ప్రసిద్ధ కళాకృతులను ఆవిష్కరించడంలో ఆయకు ఆయనే సాటి. వారణాసిలోని ఓ ప్రదేశంలో అక్కడి ప్రజలు చెత్త వేయడం, ఉమ్మి వేయడాన్ని గమనించాడు. 500 చదరపు అడుగుల గోడ పై వైరాగ్య సుందరం దేవత మూర్తులు కనిపించే విధంగా కళాకృతిని గీశాడు. చిన్న బ్రష్‌తో 6 రోజుల పాటు నిద్రాహారాలు మాని కళాఖండాన్ని నిర్మించాడు. ఈ గోడ చిత్రం ఆలయ స్థలంగా మలిచాడు. ప్రభుత్వ సంస్థలు, కళా సంఘాలు, విద్యా సంస్థలతో కలిసి వర్క్‌షాపులు, లైవ్ సెషన్లు, అతిథి లెక్చరర్‌గా పని చేశాడు.


మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రం వేస్తున్న నవనీత్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

యువతకు దిశానిర్దేశం



ఆర్ట్, డిజైనింగ్, ఇన్నోవేషన్ పై యువతకు దిశానిర్దేశం చేస్తా. డిజైనింగ్ రంగంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తా. సాంకేతిక, ప్రొఫెషనల్ అనుభవాలను విద్యా కార్యక్రమాలకు కథల రూపంలో పుస్తకాలను ప్రచురించే ప్రయత్నంలో ఉన్నాను.

– నవనీత్, హుస్నాబాద్